
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 100 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం | 12.10.2026 | పేజీలు : 8

రైతు పట్ల అనుచిత వ్యాఖ్యలు
గజ్వేల్ తహసీల్దార్ పై సస్పెన్షన్ వేటు

- "పురుగుల మందు తాగలేదా?" అంటూ అధికారి చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్
- ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో విచారణకు ఆదేశించిన కలెక్టర్
- ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ



2

తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల
పూర్తి షెడ్యూల్ విడుదల

- అధికమాసం రావడంతో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు
- ఇటీవలే ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 16న గరుడ వాహన సేవ, 20న చక్రస్నానం
- ధ్వజారోహణం, ధ్వజావరోహణం లేకుండా జరిగే ఉత్సవాలు



2

చెన్నెలో కొత్త మెట్రోకు పచ్చజెండా..
తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

- చెన్నై మెట్రో ఫేజ్ 2లో కీలకమైన పూనమల్లి-వడపళని మార్గం ప్రారంభం
- జెండా ఊపి రైలును ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం విజయ్
- కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించిన ఇరువురు నేతలు
- పశ్చిమ శివార్ల నుంచి నగర కేంద్రానికి తగ్గనున్న ప్రయాణ సమయం



2

హైదరాబాద్ కు డ్రగ్స్
గోవా నుండే..
- సీఎం రేవంత్ రెడ్డి

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానే అని ఆరోపణ

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక .....

2



సిరిసిల్ల జేఎన్టీయూ
సమస్యలపై కేటీఆర్ ఆగ్రహం

- వెంటనే కొత్త క్యాంపస్‌ను నిర్మించండి
- 20021లోనే రూ.402 కోట్లతో పరిపాలనా అనుమతులొచ్చాయి
- అప్పటిదాకా ప్రస్తుత క్యాంపస్‌లోనే కొనసాగించండి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి
- కీలక ప్రసంగం చేయనున్న కేటీఆర్ .

నిత్యం నిఘా, హైదరాబాద్ : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన .....

2



ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..
ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు

- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ



2

వరాల వరద కేసీఆర్..
కరువు దరువు కాంగ్రెస్
- హరీష్ రావు

- నదుల్లో నీళ్లున్నా ఎత్తిపోయలేని అసమర్థ ప్రభుత్వమిది
- కొత్తవి వద్దు, ఉన్నవి రద్దు.. ఇదే కాంగ్రెస్ పాలన తీరు
- జిల్లాల పునర్విభజనతో ప్రగతి ముద్ర వేసిండు కేసీఆర్
- సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో మాజీ మంత్రి హరీశ్



2

జ్ఞానేశ్ కుమార్‌కు ఏమైనా రహస్యాలు తెలుసా..? అందుకే కాపాడుతున్నారా..?
- సీజేపీ నేత సౌరవ్ దాస్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలు
- నిరసనలను అణిచివేసేందుకు నక్సల్, సరిహద్దు ప్రాంతాల నుంచి భద్రతా బలగాల తరలింపు
- ఢిల్లీని కంటోన్మెంట్‌గా మార్చేశారని కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర ఆరోపణ
- సామాన్యులను ఇబ్బంది పెట్టి ఉద్యమంపై వ్యతిరేకత సృష్టించేందుకు ప్రభుత్వ కుట్ర



నిత్యం నిఘా, గజ్వేల్ : ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన నిరసనలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలు దారితీశాయి. ఈ నిరసనలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నక్సల్ ప్రభావిత, సరిహద్దు ప్రాంతాల నుంచి భద్రతా దళాలను ఢిల్లీకి తరలించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆదివారం ఆరోపించింది. ఢిల్లీని ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారని తీవ్రంగా విమర్శించింది. నివారణ అరెస్టు తర్వాత కోర్టు నుంచి విడుదలైన సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడారు. "ఒక్క వ్యక్తిని కాపాడేందుకు దేశంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారు? 2024 ఎన్నికలకు సంబంధించి లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన తీరుపై ఆయనకు ఏమైనా రహస్యాలు తెలుసా?" అని సౌరవ్ దాస్ .....

2

ఎమర్జెన్సీ గురించి ముందు రాహుల్ నేర్చుకోవాలి : కేంద్ర మంత్రి కిషన్

- ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి
- ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పే అర్హత కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- తెలంగాణకు వచ్చి చూడాలంటూ రాహుల్ గాంధీకి సవాల్
- బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ



2

చెన్నెలో కొత్త మెట్రోకు పచ్చజెండా..

తొలి ప్రయాణం చేసిన ప్రధాని మోదీ, సీఎం విజయ్

నిత్యం నిఘా, తిరుమల : చెన్నై మహానగరంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. చెన్నై మెట్రో రైల్ ఫేజ్ 2లో భాగంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పూనమల్లి–వడపళని మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేడు కలిసి ప్రారంభించారు. పోరూర్ బైపాస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు నేతలు జెండా ఊపి తొలి రైలు సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొత్త మెట్రో రైలులో కలిసి ప్రయాణించి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. కారిడార్ 4లో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో ఈ కొత్త మార్గాన్ని నిర్మించారు. 15 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో మొత్తం 11 ఎలివేటెడ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా, కొన్నిచోట్ల డబుల్ డెక్కర్ సెక్షన్‌ను నిర్మించడం ఈ మార్గం ప్రత్యేకత. అంతేకాకుండా భవిష్యత్తులో డ్రైవర్ అవసరం లేకుండానే రైళ్లను నడిపేందుకు వీలుగా ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది రైళ్ల రాకపోకలలో కచ్చితత్వాన్ని, భద్రతను పెంచుతుంది. ఈ కొత్త మెట్రో కారిడార్ అందుబాటులోకి రావడంతో చెన్నై పశ్చిమ శివారు ప్రాంతాలైన పూనమల్లి వంటి ఏరియాల నుంచి వడపళని వంటి నగర కేంద్ర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. రోజూ ప్రయాణించే వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ మార్గంలో ప్రయాణికుల కోసం సాధారణ సర్వీసులను కూడా ప్రారంభించారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ కొత్త మెట్రో లైన్ చెన్నై నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

- రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి.. టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

సిరిసిల్ల జేఎన్టీయూ సమస్యలపై దృష్టి పెట్టండి

మొదటిపేజీ తరువాయి.. జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నదని ఆదివారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమి కేటాయించామని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభంకాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని తెలిపారు.

ప్రైవేట్ భవనంలోకి తరలించొద్దు

కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేట్ భవనానికి తరలించే ప్రతిపాదనల వల్ల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు చుట్టుపకల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

వరాల వరద కేసీఆర్.. కరువు దరువు కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి.. నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటతెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి వల్లే రాష్ట్రం ప్రగతి పథాన పయనించిందని, సిద్దిపేట జిల్లా అభివృద్ధికి కేసీఆర్ వేసిన పునాదే కారణమని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టంచేశారు. చరిత్రలో ఒకసారి ఏర్పడే జిల్లా హోదా, ఒకసారి వచ్చే రైలుమార్గం, సాగునీటి ప్రాజెక్టుల వంటి విజయాలు సిద్దిపేట అభివృద్ధిలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఈ విజయాల వెనుక కేసీఆర్ కృషి ఎంతగానో ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రైతులు, యువత, విద్యార్థులు, పేదల సమస్యల పరిషారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టంచేశారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన మూడు రోజుల దశాబ్ది ఉత్సవాల ముగింపు మహాసభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి హరీశ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు బ్రేకులు వేసి, ప్రాజెక్టులను రద్దు చేయడం, రైతులను కష్టాల్లోకి నెట్టడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, విద్యుత్తు ఉత్పత్తి చేయలేక, సాగునీటి ప్రాజెక్టుల మోటర్లు నడుపలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ కరువని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో ఐదేండ్లలోనే అనేక ప్రాజెక్టులు పూర్తిచేశారని, కాలువలు నిండుగా ప్రవహించడం, భూగర్భజలం పెరిగి, సాగుకు 24 గంట ల విద్యుత్తు అందడంతో వ్యవసాయ రంగ ము ఖచిత్రం మారిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైందని, కరెంటు కోతలతో మోటర్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు : సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి..

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

రైతు పట్ల అనుచిత వ్యాఖ్యలు.. గజ్వేల్ తహసీల్దార్ పై సస్పెన్షన్ వేటు

మొదటిపేజీ తరువాయి.. సిద్దిపేట జిల్లాలో ఓ రైతు పట్ల అమానవీయంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. భూ వివాదం విషయమై తనను కలిసేందుకు వచ్చిన రైతును కించపరిచేలా మాట్లాడాడంటూ గజ్వేల్ తహసీల్దార్ చిట్టంపల్లి స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మండలం మక్త మాసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యేసు, రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూ సేకరణ పరిహారం విషయంలో తన బంధువులతో ఉన్న వివాదంపై మాట్లాడేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో కలిసి ఆయన తహసీల్దార్ స్వామిని కలిశారు. రైతు తన సమస్యను వివరిస్తుండగా, అధికారి స్పందించిన తీరు తీవ్ర వివాదాస్పదమైంది. "ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?" అంటూ తహసీల్దార్ రైతును ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అలా అన్నారా అని ప్రశ్నించగా.. "అవును, ఉద్దేశపూర్వకంగానే అన్నాను" అని అధికారి బదులివ్వడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తహసీల్దార్ తీరుపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైంది. రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ప్రాథమిక విచారణ జరిపి, తహసీల్దార్ ప్రవర్తన సరికాదని నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్.. తహసీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. ఈ ఘటన సుమారు 5–6 నెలల క్రితం జరిగిందని, ఆ తర్వాత తన భూ వివాదం పరిష్కారమై పరిహారం డబ్బులు కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని రైతు యేసు స్వయంగా వెల్లడించిన మరో వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఘటన పాతదే అయినప్పటికీ, అధికారి ప్రవర్తన సరైంది కాదన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి.. తిరుమల పుణ్యక్షేత్రం మరో ఉత్సవానికి సిద్ధమైంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అధికమాసం రావడం వల్ల ఈ ఏడాది స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భాద్రపద మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు 11న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాధారణంగా చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చినప్పుడు కన్యామాసంలో (భాద్రపదం) వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం తిరుమల సంప్రదాయం. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో వీటికి ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి ఘట్టాలు ఉండవు. అంకురార్పణతో నేరుగా ఉత్సవాలు ప్రారంభమై, చక్రస్నానంతో పరిసమాప్తం అవుతాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఎదురుచూసే గరుడ వాహన సేవ అక్టోబరు 16న జరగనుంది. అలాగే, అక్టోబరు 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం ఊరేగింపు, 20న చక్రస్నానం ఘట్టాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం వాహన సేవలు 8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విశేషంగా నిర్వహిస్తారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్:

అక్టోబరు 11:	అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)
అక్టోబరు 12:	బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 13:	చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 14:	సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 15:	కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 16:	మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)
అక్టోబరు 17:	హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 18:	సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 19:	స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 20:	చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

జ్ఞానేశ్ కుమార్‌కు ఏమైనా రహస్యాలు తెలుసా? అందుకే కాపాడుతున్నారా..?

- సీజేపీ నేత సౌరవ్ దాస్

మొదటిపేజీ తరువాయి.. ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని, ఈ నిరసనల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. "గత కొన్ని రోజులుగా ఢిల్లీ నగరాన్ని మొత్తం ఓ కంటోన్మెంట్‌గా మార్చేశారు. నిరసనలను అడ్డుకునేందుకు నక్సల్ ప్రాంతాలు, బెంగాల్, కశ్మీర్ నుంచి ప్రత్యేక దళాలను, సరిహద్దుల నుంచి బీఎస్ఎఫ్ సిబ్బందిని విమానాల్లో తరలించారు. దాదాపు 30,000 నుంచి 40,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు" అని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సౌరవ్ దాస్ అన్నారు. "ఆందోళనకారులపై ప్రజల్లో వ్యతిరేకత సృష్టించేందుకే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మెట్రో స్టేషన్లు మూసివేయడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లను నిలిపివేయడం, దుకాణాలను బలవంతంగా మూయించడం వంటి చర్యలతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. కానీ, ప్రభుత్వం పొరబడుతోంది. యువతపై జరుగుతున్న ఈ దౌర్జన్యాన్ని దేశమంతా గమనిస్తోంది" అని పేర్కొన్నారు. తమను అరెస్టు చేసే సమయంలో ఢిల్లీ పోలీసులు ఎలాంటి అధికారిక నోటీసులు ఇవ్వలేదని, ఫోన్లను స్వాధీనం చేసుకుని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు హ్యాక్ చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో మెట్రో, రైల్వే సేవలను సాధారణ స్థితికి తీసుకురావాలని, ఇంటర్నెట్ కనెక్టివిటీకి అంతరాయం కలిగించవద్దని సుప్రీంకోర్టు అధికారులను ఆదేశించడాన్ని సీజేపీ న్యాయ వ్యవహారాల అధిపతి రత్న సింగ్ స్వాగతించారు. అయితే, కోర్టు ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతాయో చూడాలని ఆమె అన్నారు.

సోమవారం 12 - 10 - 2026

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

సుందరయ్య భవన్‌లో ఘనంగా సీపీఎం అధ్యయన తరగతులు

- **‘నా నాగేటి సాళ్లు’ పుస్తకంపై సమగ్ర చర్చ**
- **ఉద్యమ ప్రస్థానం, పార్టీ సిద్ధాంతాలపై కార్యకర్తలకు అవగాహన**



హనుమకొండ, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో ఆదివారం అధ్యయన తరగతులు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి రచించిన ‘నా నాగేటి సాళ్లు (జీవితం–ఉద్యమ గమనం)’ పుస్తకంపై సమగ్ర చర్చ చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పుస్తకంలోని ముఖ్యాంశాలు, రచయిత ఉద్యమ ప్రస్థానం, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా పోరాటాల ప్రాముఖ్యతను వివరించారు. నాయకులు, కార్యకర్తలకు పుస్తకంలోని అంశాలపై అవగాహన కల్పిస్తూ సమగ్రంగా వివరించారు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను అర్థం చేసుకోవడంతో పాటు సామాజిక పోరాటాలపై అవగాహన పెంపొందించుకోవాలని, పార్టీ సిద్ధాంతాలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా ఉద్యమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లవచ్చని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తల్లో అధ్యయన సంస్కృతిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రౌతుల రమేష్, బొట్ల చక్రపాణి, మంద సంపత్, గొడుగు వెంకట్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. స్వచ్ఛ కార్మికులుగా మారిన కాలనీవాసులు!

- **డ్రైనేజీ శుభ్రం చేయాలంటే అదనపు డబ్బులు అడుగుతున్నారా?**
- **53వ డివిజన్ లక్ష్మీ కిరణం కాలనీలో ప్రజలేచేపట్టిన శ్రమదానం**



హనుమకొండ, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హనుమకొండలోని 53వ డివిజన్ లష్కర్ సింగారం లక్ష్మీ కిరణం కాలనీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా స్పందన కరువు!

కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి పలుమార్లు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. మరోవైపు డ్రైనేజీని శుభ్రం చేయాలంటే అదనంగా డబ్బులు ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారని కాలనీవాసులు ఆరోపించడం వివాదాస్పదంగా మారింది. ప్రజలు చెల్లిస్తున్న పన్నులకు ప్రతిఫలంగా కనీస పారిశుధ్య సేవలు కూడా అందడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చివరకు ప్రజలే రంగంలోకి..

అధికారుల స్పందన కోసం ఎదురుచూసి విసిగిపోయిన కాలనీవాసులు సమస్య పరిష్కారానికి తామే నడుం బిగించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గునపాలు, పారలు చేతపట్టి శ్రమదానం చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను స్వయంగా తొలగించి కాలువలను శుభ్రం చేసుకున్నారు. ప్రజలకు అందించాల్సిన పారిశుధ్య సేవల కోసం కాలనీవాసులే శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడటంపై

స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేనా?

పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 53వ డివిజన్‌లో పారిశుధ్య పనులను క్రమబద్ధీకరించాలని, డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని కోరుతున్నారు. అదనపు డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైస్ మిల్లర్ల దెబ్బకు రైతులు బేజారు!

- **క్వింటా ధాన్యానికి 5 నుంచి 10 కిలోల కోత?**
- **కొనుగోలు కేంద్రాల్లో రైతుల దోపిడీని అరికట్టాలి: కాంగ్రెస్ నాయకుడు తోట సత్యం**



ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు ధాన్యం విక్రయించే సమయంలోనూ కష్టాలు తప్పడం లేదని కాంగ్రెస్ నాయకుడు తోట సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని కాటాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి క్వింటా ధాన్యానికి ఐదు నుంచి పది కిలోల వరకు కోత విధిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. గత యాసంగి సీజన్‌లోనూ ఇదే తరహాలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తోట సత్యం పేర్కొన్నారు. ధాన్యం రవాణా విషయంలోనూ రైతులపై అదనపు భారం పడుతోందని ఆరోపించారు. లారీ యజమానులు 40 కిలోల బస్తాకు రూ.10 చెల్లిస్తేనే కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపుతున్నారని తెలిపారు. ఈ సమస్య ములుగు జిల్లాకే పరిమితం కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ కొనసాగుతోందని ఆరోపించారు.

మిల్లర్ల సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలి

ఈ ఏడాది ప్రతి రైస్ మిల్లుకు అనుమతులు ఇవ్వాలని, ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులు తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ ట్రాక్ సెట్ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రైతులను దళారులు ఈ స్థాయిలో దోచుకుంటుంటే ‘రైతే రాజు’ అనే నినాదానికి అర్థం ఏమిటని ప్రశ్నించారు.

ఎరువుల ధరలు తగ్గించాలి.. గిట్టుబాటు ధర పెంచాలి

మరోవైపు కాంప్లెక్స్ ఎరువుల ధరలు

ఆకాశాన్నంటుతున్నాయని, ఒక్కో బస్తాకు రూ.600 వరకు వసూలు చేస్తున్నారని తోట సత్యం ఆరోపించారు. పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే బోనస్‌ను పెంచడంతో పాటు ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన అని చెప్పుకోవడమే కాకుండా ఆచరణలో రైతులకు న్యాయం చేసి చూపించాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కోతలు, రవాణా ఖర్చుల భారం, ఎరువుల ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే రైతుల బతుకులు మరింత దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని తోట సత్యం డిమాండ్ చేశారు.

బక్కి సంజీవ మృతికి పర్వతగిరి నాయకుల సంతాపం

- **కుటుంబ సభ్యులకు పరామర్శ.. ఆర్థిక సాయం అందజేత**



వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బక్కి సంజీవ గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పర్వతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ సంజీవ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతకుంట్ల అనిత రమేష్, పట్టణ అధ్యక్షుడు నరెడ్ల సంతోష్, మాజీ పట్టణ అధ్యక్షుడు కుసం రామచందర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిన్నింటి సునీల్ రావు, సహకార సంఘం డైరెక్టర్ నరెడ్ల సూరయ్య, మాజీ పట్టణ ఉపాధ్యక్షుడు చనమాల నరసయ్య, వార్డు సభ్యులు పుల్లూరి రజినీకాంత్, వర్ధినేని సతీష్ రావు, చింతపట్ల అజయ్ రావు, జంగ గంగాధర్ యాదవ్, చీదురు తిరుపతి, నూనె మణికుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేద గిరిజన విద్యార్థిని చదువుకు కేటీఆర్ ఆర్థిక భరోసా

- **వీరాపూర్‌కు చెందిన శృతికి రూ.50 వేల సాయం**
- **ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**





ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పేదరికం కారణంగా ఉన్నత విద్యకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ గిరిజన విద్యార్థినికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన పెనుక శృతి ఉన్నత చదువుల కోసం చేసిన విజ్ఞప్తికి స్పందించి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. పేదరికం తన చదువుకు అడ్డంకిగా మారుతోందంటూ శృతి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చేసిన విజ్ఞప్తిపై కేటీఆర్ స్పందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శృతి కుటుంబానికి ఉన్నత విద్య ఖర్చులు భరించడం భారంగా మారింది. అయినప్పటికీ పట్టుదలతో చదివిన ఆమె కొడంగల్ వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యలో పట్టా కోర్సు ప్రవేశం పొందింది. అయితే చదువును కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో సాయం కోరింది. కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు శృతి కుటుంబాన్ని స్వయంగా కలిసి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం శృతితో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి ఆమెకు ధైర్యం చెప్పారు. చదువు గురించి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ముందుకు సాగుతూ బాగా చదువుకోవాలని భరోసా ఇచ్చినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో తనలాంటి పేద విద్యార్థులకు సహాయం చేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. తమ కుమార్తె చదువుకు ఆర్థిక సాయం అందించడంతో పాటు ఫోన్ చేసి ధైర్యం చెప్పిన కేటీఆర్‌కు, కుటుంబాన్ని కలిసి సాయం అందించిన లక్ష్మణ్ బాబుకు శృతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, తాడూరి రఘు, ఎండీ ఖాజా పాషా, కర్ర రవీందర్, పులుసం పురుషోత్తం, రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ దన్నపునేని కిరణ్, రఫిక్, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, వావిలాల ముత్తయ్య, కొండాయి చిన్ని, తాళ్లపెల్లి మోహన్, బాస శరత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వేయి స్తంభాల ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి





హనుమకొండ, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన సతీమణితో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవి శరన్నవ రాత్రి పర్వదినాలు నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. దుర్గాదేవి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వేయి స్తంభాల ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు

- అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- యువత భాగస్వామ్యంతో ఎన్నికలకు సమాయత్తం కావాలి: బీజేపీ నాయకులు



వరంగల్ తూర్పు, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): వవరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశీబుగ్గలో జిల్లా ఎన్నికల సమన్వయకర్త నాగవెల్లి సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు, యువత భాగస్వామ్యం, ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు రత్నం సతీష్ షా, త్రిలోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కోమాకుల నాగరాజుతో పాటు పలువురు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామప్పకు ముప్పు తెచ్చే బొగ్గు గనులు వద్దు!

- బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న డిమాండ్
- ప్రపంచ వారసత్వ సంపదను కాపాడాలి.. మైనింగ్ ప్రతిపాదనలను విరమించుకోవాలి



ములుగు జిల్లా, వెంకటాపూర్, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప దేవాలయంతో పాటు రామప్ప చెరువుకు ముప్పు కలిగించే అవకాశం ఉన్న బొగ్గు గనుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న స్పష్టం చేశారు. రామప్ప పరిసర ప్రాంతాల్లో బొగ్గు గనుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాకతీయుల అద్భుత శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచిన రామప్ప దేవాలయం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని జంపన్న పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ చారిత్రక కట్టడాన్ని, దాని పరిసరాల్లోని రామప్ప చెరువును భావితరాలకు భద్రంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చారిత్రక, పర్యావరణ ప్రాధాన్యం కలిగిన ప్రాంతాల సమీపంలో బొగ్గు గనుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. బొగ్గు తవ్వకాలు, పేలుళ్ల కార్యకలాపాలు ప్రారంభమైతే దేవాలయ నిర్మాణ భద్రత, చెరువు నీటి వనరులు, భూగర్భ జలాలు, పర్యావరణంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూమి స్వభావంలో మార్పులు, నీటి వనరులపై ప్రభావం, ప్రకృతి సమతుల్యతకు కలిగే నష్టాలను ముందుగానే శాస్త్రీయంగా అంచనా వేయాలని సూచించారు. చారిత్రక కట్టడాల పరిరక్షణకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బొగ్గు గనుల తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదని, ప్రస్తుతం ప్రతిపాదనల దశలోనే ఉన్నందున ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని జంపన్న అన్నారు. ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, పర్యావరణం, చారిత్రక వారసత్వ పరిరక్షణపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. నష్టం జరిగిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడం కంటే, ముందుగానే ప్రమాదాలకు తావులేకుండా వ్యవహరించడం అవసరమన్నారు. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రపంచ వారసత్వ సంపదను ప్రమాదంలోకి నెట్టకూడదని జంపన్న స్పష్టం చేశారు. రామప్ప దేవాలయం, రామప్ప చెరువు పరిరక్షణ విషయంలో ప్రజలు, పర్యావరణవేత్తలు, చరిత్రకారుల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. రామప్ప పరిసరాల్లో బొగ్గు గనుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. "రామప్పకు, రామప్ప చెరువుకు ముప్పు తెచ్చే బొగ్గు గనులు వద్దు. ప్రపంచ వారసత్వ సంపదను కాపాడాలి. రామప్పను, రామప్ప చెరువును భావితరాలకు సురక్షితంగా అందించాలి" అని భూక్య జంపన్న స్పష్టం చేశారు.

పేద విద్యార్థులకు మెరిట్ ఉపకార వేతనాల పంపిణీ

- మంథని ఉన్నత పాఠశాలలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పేద విద్యార్థులను ప్రోత్సహించి, వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో విశ్వబ్రాహ్మణ అధికారిక, వృత్తి నిపుణుల సంఘం ఆధ్వర్యంలో మంథని ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సంఘం మంథని అధ్యక్షుడు కొమురోజు శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొమురోజు శ్రీనివాస్ ముఖ్య అతిథి ఓడ్నాల శ్రీనివాస్‌కు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. అనంతరం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం పలువురి దృష్టిని ఆకర్షించింది. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి సదాశివ్ సంఘం కార్యకలాపాలు, నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు



వరంగల్ జిల్లా/ సంగెం,అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్–నల్గొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు సూచించారు. సంగెం మండల గౌడ సంఘం సామాజిక భవనంలో బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుపుల చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు అవసరమైన కార్యాచరణ, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ పరిసర ప్రాంతాల్లోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు. పట్టభద్రుల ఓటు హక్కు ప్రజాస్వామ్య బలోపేతంలో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎల్కూరు రంగంపేట గ్రామ సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి, జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎన్నికల జిల్లా సహ కన్వీనర్ కూతురు రాజు, ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్ ఎండీ రహమతుల్లా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుట్టి కుమారస్వామి, పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి..
ఖననం చేసిన మృతదేహం వెలికితీత

- **పోస్టుమార్టం నివేదికతో వెలుగులోకి రానున్న మృతికి గల కారణాలు**



పెద్దపల్లి జిల్లా / ధర్మారం, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన గంగాధర లక్ష్మి అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బంధువు సింగిరెడ్డి సరోజన ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అంత్యక్రియలు నిర్వహించిన మృతదేహాన్ని వెలికితీసి, అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మి శనివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అదే రోజు రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆమె మృతిపై కాలనీవాసులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటు, మృతురాలి సమీప బంధువు సింగిరెడ్డి సరోజన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కుటుంబ కలహాల కారణంగా అత్తాకోడళ్ల మధ్య తరచూ గొడవలు జరిగేవని, ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై ధర్మారం సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు నేపథ్యంలో ఆదివారం మృతదేహాన్ని వెలికితీసి, తహసీల్దార్ డి. శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తీక్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం లక్ష్మి మృతికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

నూతన సీఐకు సన్మానం.. ఎస్సైకు ఘనంగా వీడ్కోలు

- **మృతుల కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పరామర్శ**







వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలంలో ఆదివారం పలు కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పాల్గొన్నారు. మండలంలోని మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చడంతో పాటు, బదిలీపై వెళ్తున్న ఎస్సై భోగం ప్రవీణ్‌కు వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఆర్. సంతోష్‌ను సన్మానించి స్వాగతం పలికారు. మండల కేంద్రానికి చెందిన బక్కి సంజీవ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మేడిశెట్టి రాములు పరామర్శించి ఓదార్చారు. అనంతరం తుర్కల సోమారం శివారు గుంటూరుపల్లెలో ఇటీవల మృతి చెందిన పున్నం ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యంతో ఉండాలని సూచించారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పర్వతగిరి మండలంలో గత కొన్నేళ్లుగా ఎస్సైగా విధులు నిర్వహించి వర్ధన్నపేటకు బదిలీ అయిన భోగం ప్రవీణ్‌ను కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పూలమాల, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. మండలంలో ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. నూతనంగా సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆర్. సంతోష్‌ను కూడా మేడిశెట్టి రాములు శాలువాతో సత్కరించి, పూలకుండీ అందజేసి స్వాగతం పలికారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తీక్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం లక్ష్మి మృతికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

మొండ్రాయిలో భూ వివాదం..
నకిలీ పత్రాలతో కబ్జా చేశారని ఆరోపణ

- **1994లో పంచాయతీ వేలంలో కొనుగోలు చేసిన 160 గజాల భూమిపై వివాదం**
- **కలెక్టర్, తహసీల్దార్ స్పందించి న్యాయం చేయాలి: బాధితుడు మామిళ్ళ సంపత్**



సంగెం, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): మొండ్రాయి గ్రామంలోని సర్వే నంబర్ 2లో ఉన్న 160 చదరపు గజాల భూమి విషయంలో తనకు అన్యాయం జరిగిందని, నకిలీ పత్రాలతో భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన మామిళ్ళ సంపత్ అధికారులను ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న అసలు పత్రాలను పరిశీలించి, భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌ను కోరారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంపత్ మాట్లాడుతూ.. తమ తాత 1994లో మొండ్రాయి గ్రామ పంచాయతీ నిర్వహించిన బహిరంగ వేలంలో సర్వే నంబర్ 2లోని 160 చదరపు గజాల భూమిని రూ.11,600కు కొనుగోలు చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించిన అసలు పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అదే సర్వే నంబర్‌లో రావుల పల్లి జనార్దన్ పేరు పొరపాటున నమోదైందని, ఆ భూమితో తనకు ఎలాంటి సంబంధం లేదని, భూమిని ప్రభుత్వానికి, పాఠశాలకు ఇచ్చినట్లు జనార్దన్ గతంలో అప్పటి తహసీల్దార్‌కు అఫిడవిట్ సమర్పించారని సంపత్ వెల్లడించారు. తమ తాతకు ఐదుగురు కుమారులు ఉండగా, రెండో కుమారుడైన మామిళ్ళ కుమారస్వామి 1995లో మరణించడంతో కుటుంబం విడిపోయిందని తెలిపారు. అప్పటి నుంచి కుటుంబ పరిస్థితుల కారణంగా భూమి వద్దకు వెళ్లలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2017లో రావులపల్లి జనార్దన్ అన్న కుమారుడైన రావులపల్లి అనిల్‌కుమార్.. సంతానం లేని జనార్దన్ పేరును ఉపయోగించుకొని నకిలీ పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సంపత్ ఆరోపించారు. అనంతరం 2019లో కడ్దూరి నరేష్, ముస్కు లింగమూర్తి అనే వ్యక్తులకు విక్రయించారని, ప్రస్తుతం ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు.నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన తన పెద్దనాన్న మామిళ్ళ మల్లయ్యపై పలుమార్లు దాడి చేశారని ఆరోపించారు. ఈ విషయంపై సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి తహసీల్దార్ పూల ఉమారాణి ఈ పత్రాలను తయారు చేసి ఇచ్చారని, కోర్టులో విజయలక్ష్మి ఆమోదించారని కూడా సంపత్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ న్యాయం జరగలేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి తమ వద్ద ఉన్న అసలు పత్రాలను పరిశీలించాలని, భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని సంపత్ విజ్ఞప్తి చేశారు. తమకు చెందిన భూమిని తిరిగి అప్పగించేలా చట్టప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.గమనిక: భూమి యాజమాన్యం, పత్రాల చెల్లుబాటు, అక్రమ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలు బాధితుడు చేసిన ఆరోపణలు మాత్రమే. వీటిపై అధికారిక విచారణ వివరాలు అందుబాటులో లేవు.

నాగేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

- **గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మండలం నాగేపల్లి గ్రామంలో వార్డు సభ్యుడు బొమ్మకంటి సతీష్ ఆధ్వర్యంలో, కొండపర్తి హరీష్, కొండపర్తి అఖిల నరేష్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గుమ్మడి సమ్మయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య బృందం గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించింది. ఈ కార్యక్రమంలో కొండపర్తి హరీష్, కొండపర్తి అఖిల నరేష్, వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శిగా బండ నాగరాజు

- **జనగామ జిల్లా బాధ్యతలు అప్పగింత.. నియామకంపై నాయకుల హర్షం**



జనగామ జిల్లా, రఘునాథ్‌పల్లి, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జనగామ జిల్లా కార్యదర్శిగా రఘునాథ్‌పల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన బండ నాగరాజు నియమితులయ్యారు. ఈ నియామక వివరాలను కమిటీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్ దాస్ ఉపేందర్ వెల్లడించారు. కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాలు, జాతీయ ఉపాధ్యక్షుడు ఏటి ఆంజనేయులు సూచనలు, రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. జనగామ జిల్లా ఇన్‌చార్జి నీలం భాస్కర్ సూచనలతో పాటు జిల్లా అధ్యక్షుడు జావీద్ పాషా సహకారంతో బండ నాగరాజుకు జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బండ నాగరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందేలా కృషి చేస్తానని, అవినీతికి వ్యతిరేకంగా నిబద్ధతతో పనిచేస్తానని అన్నారు. బండ నాగరాజు నియామకం పట్ల పలువురు కమిటీ నాయకులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

14న జనగామ పట్టణంలోని ప్రెస్టేన్ కళాశాలలో సీనియర్ కబడ్డీ పురుషుల, మహిళల సెలక్షన్

- **సత్తుపల్లిలో జరిగే 73వ తెలంగాణ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో మహిళల జట్టు పాల్గొనడం**



జనగామ, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): జనగామ పట్టణంలోని ప్రెస్టేన్ కళాశాలలో ఈ నెల 14న సీనియర్ కబడ్డీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వై. కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సెలక్షన్‌లో ఎంపికైన మహిళల కబడ్డీ జట్టు సత్తుపల్లిలో నిర్వహించనున్న 73వ తెలంగాణ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటుందని అధ్యక్షుడు వై. కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, కోశాధికారి ఉప్పలయ్య తెలిపారు. సెలక్షన్‌కు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు ప్రెస్టేన్ కళాశాలకు చేరుకోవాలని సూచించారు. పురుష క్రీడాకారుల బరువు 85 కిలోలు, మహిళా క్రీడాకారుల బరువు 75 కిలోలు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9010255898, 9963863436 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భద్రాచలంలో జాతీయ గోండి – కోయ భాషా వర్క్‌షాప్‌పై సమీక్ష

- తొమ్మిది రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధుల పాల్గొనడం
- కోయ భాష పరిరక్షణ, ప్రామాణీకరణకు కీలక ముందడుగు



భద్రాచలం, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): తొమ్మిది రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు పాల్గొన్న 12వ జాతీయ గోండి–కోయ భాషా ప్రామాణీకరణ, నిఘంటువు రూపకల్పన వర్క్‌షాప్‌పై ఆదివారం భద్రాచలం గిరిజన అభ్యుదయ భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ సహకారంతో అక్టోబర్ 2 నుంచి 6 వరకు ఐదు రోజులపాటు ఈ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా కోయ భాషా నిఘంటువులో 20 వేలకు పైగా కొత్త పదాలను చేర్చడం విశేషమని నిర్వాహకులు తెలిపారు. గోండి–కోయ భాషల పరిరక్షణ, ప్రామాణీకరణ, అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలక ముందడుగుగా నిలిచిందన్నారు. కోయ భాషను భావితరాలకు అందించేందుకు కోయ బాల సాహిత్యం, బాలగేయాలు, ప్రాథమిక పాఠ్యపుస్తకాలు, బహుభాషా నిఘంటువులు రూపొందించాలని సమావేశంలో సూచించారు. పాఠశాల స్థాయి నుంచే మాతృభాషా విద్యను ప్రోత్సహించాలని, కోయ భాషా సాహిత్యాన్ని అభివృద్ధి చేస్తూ డిజిటల్ మాధ్యమాల ద్వారా భాషా వనరులను అందుబాటులోకి తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. కోయ భాష ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రకు ప్రతీకగా నిలిచే అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మడివి నెహ్రూ, పూనెం వీరభద్రం, తెల్లం రమణయ్య, వీసాల కృష్ణయ్య, కొండ్రు వీరస్వామి, కుంజా సంతోష్, కొర్సా చినబాబు దొర, పిసోడి కన్నయ్య, పాయం వెంకటరత్నం, వర్ల వసంత రావు, ఉయిక రాంప్రసాద్, కణితి రాధ, మిడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రియాంక గాంధీ సేన భువనగిరి యూత్ ప్రెసిడెంట్‌గా బూడిద నాగరాజు నియామకం

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: బూడిద నాగరాజు



యాదగిరిగుట్ట, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ పట్ల, ముఖ్యంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పట్ల ఉన్న నిబద్ధత, నిజాయితీ, అంకితభావాన్ని గుర్తించి యాదాద్రి–భువనగిరి జిల్లా యాదగిరిపల్లి గ్రామానికి చెందిన బూడిద నాగరాజును రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) తెలంగాణ–భువనగిరి యూత్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ మల్లెల తిర్మల్ రెడ్డి నాగరాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. నాగరాజు నాయకత్వంలో యాదాద్రి–భువనగిరి జిల్లాలో రాహుల్ ప్రియాంక గాంధీ సేన మరింత బలోపేతం అవుతుందని, పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తారని తిర్మల్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బూడిద నాగరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ మల్లెల తిర్మల్ రెడ్డికి, రాహుల్ ప్రియాంక గాంధీ సేన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.అభినందనలతో,బూడిద నాగరాజుభువనగిరి యూత్ ప్రెసిడెంట్, నల్గొండ జిల్లారాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్) – తెలంగాణ

సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని నమ్మే ముందు నిజానిజాలు ధృవీకరించుకోవాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



భూపాలపల్లి,అక్టోబర్ 12(నిత్యం నిఘా ప్రతినిధి):సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారం నిజం కాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సూచించారు. ఎడిట్ చేసిన వీడియోలు, నకిలీ స్క్రీన్‌షాట్‌లు, డీప్‌ఫేక్‌లు, తప్పుడు వార్తల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే సమాచారాన్ని చూసిన వెంటనే నమ్మడం లేదా ఇతరులకు షేర్ చేయడం చేయకూడదని, ముందుగా దాని విశ్వసనీయతను పరిశీలించి, అధికారిక సమాచార వనరుల ద్వారా నిజానిజాలను ధృవీకరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా సంచలనాత్మక పోస్టులు, భయాందోళనలు కలిగించే సందేశాలు, అనుమానాస్పద లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని షేర్ చేయడం వల్ల ప్రజల్లో అపోహలు, అనవసర భయాందోళనలు ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను వినియోగించాలని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రామప్పకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కృషి

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయం
- ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్ సేవలను కొనియాడిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్



ములుగు జిల్లా / వెంకటాపూర్, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన పాలంపేట రామప్ప దేవాలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ సేవలు అభినందనీయమని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కొనియాడారు. ఆదివారం రామప్ప దేవాలయాన్ని దర్శించుకున్న ఆయన, ఆలయ అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఈవో భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ.. వందల ఏళ్ల చరిత్ర కలిగిన రామప్ప దేవాలయంలో ప్రధాన సోమసూత్ర ద్వారం వద్ద ఉన్న సమస్యను భారత పురావస్తు శాఖతో సమన్వయం చేసుకొని కేవలం ఐదు నెలల్లో పరిష్కరించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రశంసనీయమని పేర్కొన్నారు.విధి నిర్వహణలో నిబద్ధత, అలసత్వం లేని పనితీరు, వృత్తి పట్ల అంకితభావం ఇమ్మడి భాస్కర్ ప్రత్యేకతలని అన్నారు. ఇదే స్ఫూర్తితో రామప్ప ఆలయ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. చారిత్రక వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి రమేష్, రెడ్‌క్రాస్ కోశాధికారి శిరుప సతీష్, రైస్ మిల్లర్స్ సంఘం కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షుడు అక్కల రఘు ఉత్తమ్, ములుగు ఆపోపా అధ్యక్షుడు కొండ్లె కృష్ణమూర్తి, వ్యాపారవేత్తలు అక్కినపల్లి ప్రభాకర్, ఇమ్మడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపెల్లిలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రతిష్టాపన

- కమ్మగోని సుధాకర్ గౌడ్, సర్పంచ్ సునీత రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. పాల్గొన్న గ్రామ పెద్దలు, మహిళలు





వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం కొత్తపెల్లి గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిపారవశ్యంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ కొడగాని సునీత రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో, కమ్మగోని సుధాకర్ గౌడ్ నేతృత్వంలో అమ్మవారి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో కళకళలాడింది. అమ్మవారి ప్రతిష్టాపన సందర్భంగా సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

భక్తి, ఐక్యతకు ప్రతీకగా నవరాత్రి ఉత్సవాలు

గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ ఉత్సవాలు గ్రామస్తుల్లో భక్తిభావాన్ని నింపాయి. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజాస్వామ్యంపై మోదీ నిరంకుశ ఎమర్జెన్సీని ఖండించండి

- సి.పి.ఐ. (ఎం.ఎల్.) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి





వరంగల్,అక్టోబర్ 11(నిత్యం నిఘా ప్రతినిధి): అక్రమ పద్ధతుల్లో 13 కోట్ల మంది భారతీయుల ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఢిల్లీలో నిరసన చేస్తున్న దేశంలోని విద్యార్థులు, యువతపై మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని సి.పి.ఐ. (ఎం.ఎల్.) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నిరంకుశ ఎమర్జెన్సీని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా వరంగల్ చమాన్ సెంటర్‌లో సి.పి.ఐ. (ఎం.ఎల్.) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మోదీ ప్రభుత్వం చేపట్టిన నిర్బంధ చర్యలు, లాఠీచార్జీని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉద్దేశపూర్వకంగా కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం ఫాసిస్టు హిట్లర్ బాటలో నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ విద్యార్థులు, యువకులు, మేధావులు, చివరకు సుప్రీంకోర్టు న్యాయవాదులను సైతం అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. శత్రు దేశాలతో పోరాడేందుకు దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన కేంద్ర బలగాలను ఢిల్లీలోని జంతర్ మంతర్ చుట్టూ మోహరించడం భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అన్నారు. అర్హులైన భారతీయుల ఓట్లను తొలగించిన జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ, మోదీ ప్రభుత్వం నిద్రిస్తున్నట్లు నటిస్తోందని విమర్శించారు. ప్రపంచానికి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం గురించి బోధించే విశ్వగురువు మోదీ, తన ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధ చర్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని, ఢిల్లీ నగర వీధుల్లో విధించిన ఆంక్షలను తొలగించాలని, రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న నిరసనలను అణచివేసేందుకు ఉద్రిక్తతలను సృష్టించి నిర్బంధ చర్యలు కొనసాగిస్తే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 50 వేల మందిని అక్రమంగా అరెస్టు చేశారని, వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సి.పి.ఐ. (ఎం.ఎల్.) మాస్ లైన్ వరంగల్ నగర కార్యదర్శి మైదం పాణి, ప్రజా సంఘాల నాయకులు నలగంటి చంద్రమౌళి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, నగర నాయకులు మోహన్, పున్నం కిషోర్, సాగర్, వెంకన్న, రాజు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కుటుంబ సభ్యులతో కలిసి కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్న బీజేపీ నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





నిత్యం నిఘా, షాద్ నగర్ అక్టోబర్ 11 : బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర కాశీ క్షేత్రంలో శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి మంగళ హారతి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.అనంతరం కాశీలోని హస్సీ ఘాట్‌లో ఉదయం నిర్వహించిన గంగా హారతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంగానది తీరాన జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం విశేష అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు.భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ సంప్రదాయాలకు కాశీ క్షేత్రం ప్రతీకగా నిలుస్తుందని, గంగా హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అధికారంతో పనిలేదు..

ఆడపడుచులకు చీరలే పండుగ కానుక!

- **బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరు**





నిత్యం నిఘా, కేశంపేట, అక్టోబర్ 11 : ప్రజలకు సేవ చేయడానికి పదవులు, అధికారాలు అవసరం లేదని, సేవ చేయాలనే మంచి మనసు ఉంటే చాలని కొండారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ నిరూపిస్తున్నారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని గత మూడేళ్లుగా తన సొంత నిధులతో గ్రామంలోని ఆడపడుచులకు చీరలు పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం కొండారెడ్డిపల్లిలో ప్రేమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చీరలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించేవారని గుర్తుచేశారు. ప్రభుత్వం మారినప్పటికీ మహిళల పట్ల తనకున్న అభిమానంతో ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రేమ్ కుమార్ గౌడ్ మూడేళ్లుగా సొంత ఖర్చులతో చీరలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామంలోని మహిళలందరినీ తన తోటి ఆడపడుచులుగా భావిస్తూ ప్రతి ఏటా పండుగ సమయంలో చీరలు పంపిణీ చేయడం ఆయన సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. పండుగ వేళ ఆడపడుచులకు చీరలు అందించడం ద్వారా వారిలో ఆనందాన్ని నింపుతున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే రాజకీయ పదవులు ఉండాల్సిన అవసరం లేదని, సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే ప్రజల మనసులు గెలుచుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రేమ్ కుమార్ గౌడ్ చేపడుతున్న ఈ కార్యక్రమం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, సర్పంచులు మంజుల జంగయ్య, భాస్కర్ నాయక్, ధనలక్ష్మి రామకృష్ణ, సులోచన శ్రీను, భారతి రవీందర్, ఉపసర్పంచులు నరేష్, దర్శన్, షకీల్, మాజీ సర్పంచులు యాదగిరి రావు, వెంకట్ రెడ్డి, నవీన్ కుమార్, వెంకటేష్ యాదవ్, బీరప్ప, జగన్ నాయక్, మాజీ ఎంపీటీసీలు మల్లేష్ యాదవ్, యాదగిరి, యాదయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరెస్టయిన ఆశా కార్యకర్తల విడుదలకు చైతన్య కిరణ్ కృషి

- **పరిగి, కొడంగల్ పోలీస్ స్టేషన్లను సందర్శించి అధికారులతో చర్చలు**





నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 11 : ఆశా కార్యకర్తలు, ఉద్యోగ సంఘాల నాయకుల అరెస్టుల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు చైతన్య కిరణ్ పరిగి, కొడంగల్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. పరిగి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీతో మాట్లాడి, అరెస్టయిన బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఆశా కార్యకర్తల రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషతో పాటు ఇతర ఆశా కార్యకర్తలను విడుదల చేయాలని కోరారు. ఆయన చర్చల అనంతరం వారిని విడుదల చేశారు.అనంతరం కొడంగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడ అరెస్టయిన ఆశా కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా చైతన్య కిరణ్ మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న ఆశా కార్యకర్తలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఉద్యోగుల సమస్యలను అరెస్టులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

యాసంగి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం



నిత్యం నిఘా, షాబాద్ అక్టోబర్ 11 : ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు సోమవారం ఉదయం 10:30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నట్లు షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తెలిపారు. షాబాద్, మాచనపల్లి, తాళ్లపల్లి రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. పంటల ఎంపిక, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రైతులకు సూచనలు అందిస్తారని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర కోరారు.

శ్రీ దుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు.

- **శ్రీ దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం. కనకయ్య**



నిత్యం నిఘా, ఇల్లందు, అక్టోబర్ 11 : టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో శ్రీ దుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కుటుంబ సమేతంగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్ర బోస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చౌదరిగూడ శ్రీనివాస కాలనీ అధ్యక్షుడు గా గంగిడి మహిపాల్ రెడ్డి



నిత్యం నిఘా, ఘట్కేసర్, అక్టోబర్ 11 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం చౌదరిగూడ శ్రీనివాస కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గా గంగిడి మహిపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ... శ్రీనివాస కాలనీ ప్రజల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి కోసం అందరితో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాలనీ ఉపాధ్యక్షుడిగా జితేందర్ సింగ్ రానా, కార్యదర్శి గా ఎం. రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ గా కె. సుమన్, కోశాధికారి గా జి. మనోహర్, సలహాదారులు గా జి. అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా బి. రంజిత్ కుమార్,డి. నర్సింగ్ రావు లు ఎన్నికయ్యారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అలియాబాద్‌లో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- **శ్రీ కనకదుర్గ అమ్మవారికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ ప్రత్యేక పూజలు**



నిత్యం నిఘా, శామీర్ పేట, అక్టోబర్ 11 : అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అలియాబాద్ గ్రామంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారిని అలియాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ముద్దం సుధాకర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు ముద్దం రాఘవ రెడ్డి, అబ్బాగౌని భాస్కర్ గౌడ్, కొంగ విఠల్, బోయిని సాయి కుమార్, సీహెచ్ వెంకటేష్‌తో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన మాజీ జెడ్పీటిసి పట్నం అవినాష్ రెడ్డి





నిత్యం నిఘా, షాబాద్ అక్టోబర్ 11 : వెంకటాపూర్ గేట్ సమీపంలో చిన్న సోలిపేట గ్రామానికి చెందిన ప్రహ్లాద్ రెడ్డి ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను షాబాద్ మాజీ జెడ్పీటీసీ అవినాష్ రెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ, వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెట్టిన ప్రహ్లాద్ రెడ్డి మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోడకొండలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

- **ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోచేరిక**
- **ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు నాయకులకు అండగా ఉంటా**
- **అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే నా లక్ష్యం**



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 : మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన 30 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మన రేందర్ రెడ్డి ఆధ్వర్యంలో,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోచేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ,ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకుడికి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను అన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రతి సంక్షేమ పథకం అర్హులైన పేదకుటుంబాలకు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తాను మంచాల మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసి ఒక ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అన్నారుఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోచేరిన దేవసోత్ అథీరామ్ నాయక్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రంగారెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరాం అన్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు జాటోత్ నాయక్ బానోత్ మోహన్ నాయక్ జాటోత్ నవీన్ నాయక్ జాటోత్ దేవారామ్ రమేష్ నాయక్ కాట్రోత్ సన్నీ రమేష్ ప్రవీణ్ పవన్ చింటూ లక్ష్మణ్ కొర్ర ప్రవీణ్ చేరారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వింజ మూరు ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుండెమోనిమల్లేష్ ముదిరాజ్ మంచాల సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ బోడకొండ మాజీ సర్పంచ్ దండు నరసింహగౌడ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రపాండు నాయక్ సపవత్ శ్రీధర్ నాయక్ సత్తితండా సర్పంచ్ తుకారాంనాయక్ జాటోత్ గుండమ్మ బాలునాయక్ సంతోష్ నాయక్ రాట్ల రాజేష్ జాటోత్ లచ్చిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు (సోమవారం) అన్ని రైతు వేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ప్రసారం

- **మండల అధికారులు, ప్రత్యేక అధికారులు తప్పక హాజరు కావాలి**
- **రేపు(సోమవారం)ప్రజావాణి సమయం మార్పు**



హన్మకొండ,అక్టోబర్ 11 (నిత్యం నిఘా ప్రతినిధి):ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఎల్‌నినోతో పాటు వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు మధ్యాహ్నం 12 గంటల నుంచి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడను న్నారు. ఈ సందర్భంగా రేపు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ప్రసారం కానుంది. ఈ కార్యక్రమానికి మండల అధికారులు, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు తప్పక హాజరు కావాల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

ఓబీసీ కులగణనపై సమరశంఖం..
శంషాబాద్ సభకు కేశంపేట నుంచి వెయ్యి మందికి పైగా





నిత్యం నిఘా, కేశంపేట, అక్టోబర్ 2 : ఓబీసీ కులగణన సాధన కోసం ఈ నెల 4న శంషాబాద్ గొల్లపల్లి రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ పిలుపునిచ్చారు. సభకు కేశంపేట మండలం నుంచి వెయ్యి మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కేశంపేట మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శంషాబాద్‌లో నిర్వహించనున్న ఓబీసీ కులగణన సభకు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పెద్ద సంఖ్యలో సభకు తరలించాలని నిర్ణయించారు.ఓబీసీలకు సామాజిక న్యాయం కల్పించడంలో కులగణన కీలకమైన అంశమని నాయకులు పేర్కొన్నారు. బీసీల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన స్పష్టమైన గణాంకాలు అందుబాటులో ఉంటే జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలపై విధాన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఓబీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ మాట్లాడుతూ,, ఓబీసీ కులగణన సాధన కోసం నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు కేశంపేట మండలం నుంచి వెయ్యి మందికి పైగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జనసమీకరణకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అప్పా, మాజీ మండల అధ్యక్షుడు గూడ విరేష్, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, గ్రామాల సర్పంచులు కొండారెడ్డిపల్లి పల్లె ఆనంద్ కుమార్, అల్వాల్ సురేష్ రెడ్డి, తొమ్మిదిరేకుల బీసా కవిత, కరుణాకర్ రెడ్డి, నిర్దవెల్లి భాస్కర్ గౌడ్, బోదనంపల్లి నగేష్, దత్తాయపల్లి భాస్కర్, మంగలిగూడ నరేందర్ రెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల పెంటయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి, అనసూయమ్మ, కిసాన్ సెల్ అధ్యక్షుడు కోడూరు రాములు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇబ్రహీం, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి, మనోహర్, ఏఎంసీ డైరెక్టర్ సాయిలు, వేములనర్వ మల్లేష్, ఆనంద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూప్లా నాయక్, తైద్ద పార్వతలు, ప్రకాష్ గౌడ్, నాగిళ్ల భాస్కర్, గ్యార సురేష్, చేవెళ్ల నర్సింహా, జంగయ్య, రాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, యాదగిరి చారి, అంజయ్య, మల్లేష్, నరేష్, శ్రీశైలం, సచిన్, రాజేష్, బాలాజీ, సొప్పరి జంగయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

తెలంగాణ ఊటీకి సమస్యల గ్రహణం!
అభివృద్ధి కోసం ఎదురుచూపులు..

- **వికారాబాద్‌లో రహదారులపై ట్రాఫిక్‌తో పట్టణ ప్రజల అవస్థలు**
- **వర్షం పడితే రోడ్లపై నీరు.. తగ్గితే దుమ్ముతో ఇబ్బందులు**
- **బీజేఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ కష్టాలు.**
- **రైల్వే గేట్ల సమస్యకు ఎప్పటికి పరిష్కారం?**
- **అనంతగిరి ఘాట్ రోడ్లో సూచిక బోర్డుల కరవు**
- **మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రజల డిమాండ్**





నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 11 : తెలంగాణ ఊటీగా పేరుగాంచిన అనంతగిరి కొండలకు నెలవైన వికారాబాద్ పట్టణం నిత్యం పలు సమస్యలతో సతమతమవుతోంది. వర్షాలు కురిస్తే రహదారులపై నీరు నిలిచి, వర్షాలు తగ్గిన తర్వాత పేరుకుపోయిన మట్టితో దుమ్ము ఎగసిపడుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన మురుగునీటి కాలువలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది.పట్టణంలోని ప్రధాన రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు బీజేఆర్ చౌరస్తాలో నిత్యం పెరుగుతున్న రద్దీ ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు రైల్వే గేట్ల వద్ద ఎదురవుతున్న నిరీక్షణ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందోనని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పట్టణంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి తరహాలో వికారాబాద్‌లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల మెరుగుదల, పట్టణ బస్సుల రాకపోకల్లో సమయపాలనపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.అనంతగిరి కొండలను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు ఘాట్ రహదారిపై తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, రహదారి భద్రతను మెరుగుపరచడం కూడా ముఖ్యమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పర్యాటక ప్రాధాన్యం ఉన్న పట్టణంగా వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలంటే రహదారులు, మురుగునీటి పారుదల, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా రవాణా, వైద్య సదుపాయాలపై సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యలపై స్పందించి వికారాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com